ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





పింఛన్ ఉంటుందా.?

- లబ్ధిదారుల్లో వెరిఫికేషన్ కలకలం
- ఇప్పటికే 392 పెన్షన్ల పరిశీలన పూర్తి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో


కేన్సర్ రోగులు, హృద్రోగులు, డయాలసిస్ రోగులు, పక్షవాతంతో మంచంలో ఉన్న బాధితులకు ప్రభుత్వం నెలకు రూ.15 వేలు పెన్షన్ ఇస్తోంది. వీటిలో అక్రమ సర్టిఫికెట్లు పెట్టి ఎక్కువ మంది పొందారన్నది కూటమి నేతల అభిప్రాయం. ఎన్నికల్లోనూ వీటిపై చర్చ సాగింది. వైసిపి అనుకూలమైన వారికి ఇలాంటి పింఛన్లు అటుఇటుగా చూసి ఇచ్చారన్నది విమర్శ. ఈ తరహా పింఛన్లు జిల్లాలో 1236 వరకూ ఉన్నాయి. వీటిని వెరిఫికేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో వెరిఫికేషన్ ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే 8 మండలాల్లో 392 పెన్షన్లను పరిశీలించారు. మండల అధికారులు, వైద్యుల బృందం ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక పరిశీలన చేపట్టారు. వాటిని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వారి సర్టిఫికెట్లు, ఆరోగ్యం, ఇతర సమస్యలు, ప్రస్తుతం పరిస్థితి ఏమిటి? అన్న కోణంలో పరిశీలన చేశారు. అయితే బోగస్ పెన్షన్లా లేక అర్హులా? అన్నదీ తేల్చకుండా గుంభనంగా ఉంచారు. వివరాలు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల 1న పింఛన్ వస్తే అర్హులుగా ఉంటారు. లేకుంటే పోయినట్లే.! ఈ పరిస్థితిలో పింఛన్ ఉంటుందా.? అనే విషయం ఇప్పుడు బాధితుల్లో ఆందోళన కలిగిస్తోంది. వెరిఫికేషన్ ప్రక్రియ మొత్తంగా పింఛన్‌దారుల్లో కలకలం రేపింది. బోగస్ ఎందుకు తెరపైకి వచ్చిందనేదీ చూడాలి. జిజిహెచ్ (రిమ్స్) కేంద్రంగా జారీచేసిన సర్టిఫికెట్లలో దళారులు, కొందరు డాక్టర్లు కుమ్మక్కై సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు పాల్పడ్డారన్నది వాస్తవం. వైకల్యం ఎక్కువగా చూపి సర్టిఫికెట్ ఇస్తే పెన్షన్‌కు అర్హత వస్తుంది. ఇందుకు గానూ ▶ 2లో

పందేనికి అగ్రిమెంట్.!

- బాపట్ల నియోజకవర్గంలోనూ కోడి పందేల బరులు
- ఒప్పంద పత్రాలు రాసుకుంటున్న జూదరులు
- మధ్యవర్తుల వద్ద బరుల తాలూకు నగదు
- 5 పందేలలో విజయం సాధిస్తే బైక్ బహుమతి
- పెద్ద బరుల జోలికెళ్లని పోలీసులు..



రేపల్లె నియోజకవర్గం, తూర్పుపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న జూదరులు



2025 సంక్రాంతి సంబరాలు

జూదరులు రాసుకున్న అగ్రిమెంట్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రేపల్లె నియోజకవర్గం, తూర్పుపాలెంకు ధీటుగా బాపట్ల నియోజకవర్గం మంతెనవారిపాలెం వద్ద కూడా అతి పెద్ద కోడిపందేల బరిని అధికారం అండగా సిద్ధం చేశారు. బాపట్ల పరిధిలో గతంలో ఎప్పుడూ కూడా సంక్రాంతికి కోళ్లపందేల కోసం బరులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వ హయాంలో స్థానిక నేతలు తాము చేయడానికి వేరే పనులు ఏమి లేనట్లుగా భారీ ఎత్తున కోళ్లపందేల బరులను సిద్ధం చేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం లక్షలాది రూపాయల వ్యయంతో అగ్రిమెంట్ ఒప్పందాలు చేసుకోవటం గమనార్హం. స్థానిక ముఖ్య నేత కుమారుని నేతృత్వంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న కోడిపందేల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గడిచిన కొంతకాలంగా సదరు చిన్న నేత అధ్వర్యంలో శిక్షణ పొందిన పందెం కోళ్లు ఈ పోటీల్లో తమ సత్తా చూపుతాయని లక్షలు గెలుస్తాయన్న ఆశతో తెలుగుతమ్ముళ్లు పందేలు కాసేందుకు సన్నద్ధమయ్యారు.

ఇందుకోసం బాపట్ల నియోజకవర్గం మంతెనవారి పాలెం వద్ద కోడిపందేల నిర్వహణకు పూనుకున్న వారు పందేలకు సంబంధించి అగ్రిమెంటు ఒప్పందాలు చేసుకున్నారు. సంక్రాంతి పండుగ జరిగే 3 రోజుల పాటు రోజుకు 9 జోడీలు ఒక్కొక్క జోడి రూ.3 లక్షలు, 3 రోజులకు 27 జోడీలు పందెం వేసేందుకు సమ్మతి పత్రాలు రాసుకున్నారు. ఈ 9 జోడీలలో 5 పందేలలో విజయం సాధించిన వారికి బుల్లెట్ బైక్ బహుమతిగా ఇచ్చేలా నిర్ణయించుకున్నారు. 3 రోజులలో రోజుకి 9 పందేలు ఖచ్చితంగా వేయాలని, 3 రోజుల పందేలకు సంబంతధించిన రూ.18 లక్షలు మధ్యవర్తి వద్ద ఉంచారు. 3 రోజుల్లో రోజుకి 9 జోడీలు చొప్పున రూ 27 లక్షల పందేలు జరగకపోతే మధ్యవర్తి వద్ద ఉంచిన రూ.18 లక్షలు తిరిగి ఇచ్చేది లేదని అగ్రిమెంటు పత్రాలు రాసుకున్నారు. ఈ మేరకు ఇక్కడి బరిలో పందేలు వేసే నలుగురు నిర్వాహకులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందానికి ఐదుగురిని సాక్షులుగా పెట్టుకున్నారు.

కాగా రేపల్లె నియోజకవర్గంలోని తూర్పుపాలెంలో ఆదివారం నాడే కోడిపందేలు ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన బరుల్లో జోరుగా పందేలు మొదలయ్యాయి. వరుసగా ఐదు పోటీల్లో గెలిచిన పందెం కోడి విజేతకు బైక్‌ను బహుమతిగా ఇచ్చారు.

పెద్ద బరుల జోలికెళ్లని పోలీసులు..

జిల్లాలో కోడిపందేలు, పేకాట, మట్కా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ▶ 2లో

పల్లెకు రయ్..రయ్..

- సొంత ఊళ్లకు పయనమైన జనం
- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- ప్రయాణీకులతో బస్సులు కిటకిట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగు వారి పండుగలలో అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగను సొంత గ్రామంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు మధ్య జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాలు, జిల్లాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న జిల్లా ప్రజలు వారి సొంత గ్రామాలకు పయనమయ్యారు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్ళు, ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇవి కూడా సరిపోక ప్రజలు ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు ప్రయాణీకులతో కిటకిలాడుతున్నాయి.



సంక్రాంతికి గ్రామాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ప్రజలు

సంక్రాంతి పండుగను సొంత ఊరిలో జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో పండుగవాతావరణం నెలకొంది. ఇళ్ళను సుందరంగా అలంకరించటంతో పాటు పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలలో ఉద్యోగాలు చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఎన్ఆర్ఐలు, డాక్టర్లు, లాయర్లు, సివిల్ ఇంజినీర్లు, ఐఎఎస్, ఐపిఎస్, వివిధ శాఖలలో అధికారులు, వ్యాపారాలు చేసే వారు సొంత గ్రామాలలో పండుగను చేసుకునేందుకు సొంత ఊళ్ళకు పయనమయ్యారు. వీరితో పాటు జిల్లా నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వివిధ పనులు చేసుకునేందుకు వెళ్ళిన వారు సైతం సొంత ఊళ్ళకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. పాఠశాల, కళాశాలలకు సెలవులు ఇవ్వటంతో వారు సొంత గ్రామాలకు చేరుకున్నారు.

ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు

సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే చెన్నై - హైదరాబాద్, చెన్నై- విజయవాడ, హైదరాబాద్- తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్ళను నడుపుతోంది. సంక్రాంతి సందర్భంగా ఉన్న రైళ్ళతో పాటు అదనంగా 40-50 ప్రత్యేక రైళ్ళు నడుపుతోంది. ఆర్టీసి అధికారులు సైతం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. ప్రకాశం రీజియన్‌లోని డిపోల నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు 242 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నారు. ఇందులో 220 హైదరాబాద్‌కు, 22 బస్సులు బెంగళూరుకు నడుపుతున్నారు. సంక్రాంతి అనంతరం తిరుగు ప్రయాణాలకు సైతం ఆర్టీసి ప్రత్యేక సర్వీసులను తిప్పుతోంది.

సొమ్ము చేసుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

సంక్రాంతి పండుగను ప్రైవేట్ ▶ 2లో

వివేకానంద మాట..స్ఫూర్తి బాట..

- రాష్ట్ర మంత్రి డాక్టర్ డిబివి స్వామి
- యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- ఘన నివాళులర్పించిన మంత్రి, కలెక్టర్



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వామి వివేకానంద బోధనల నుంచి స్ఫూర్తి పొందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాలతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించిన విజన్ డాక్యుమెంట్‌లో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారయ్యేలాగా ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. వివేకానందను ఆదర్శంగా తీసుకొని ఎంచుకున్న రంగాలలో యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ భారతీయ విలువలను ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి వివేకానంద అని కొనియాడారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ జ్ఞాన సముపార్జనలో వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లా జనాభాలో 40 శాతం యువత ఉందని, యువశక్తిని వినియోగించుకుని జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ▶ 2లో

పందేనికి అగ్రిమెంట్.!

(మొదటిపేజీ తరువాయి)

వీటిని నిరోధించడంలో విఫలమయితే పోలీసు అధికారులపై చర్యలుంటాయని ఎస్పి తుషార్ డూడి ఆదివారం మరోసారి హెచ్చరించారు. అయితే స్థానిక పోలీసు అధికారులు మాత్రం కోడిపందేలపై ద్వంద్వవైఖరిని అవలంభిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో నడుస్తున్న బరుల జోలికి వెళ్లకుండా ఎలాంటి అండదండలు లేకుండా గ్రామాల్లో కోడిపందేలు వేస్తున్న వారిని, అందుకు సన్నద్ధం అవుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. రేపల్లె, తూర్పుపాలెం వద్ద వేలాది మందితో కోడి పందేలు జరుగుతుంటే ఆ వైపు వెళ్ళని పోలీసులు అదే స్టేషన్ పరిధిలో బేతపూడి వద్ద జరుగుతున్న కోడిపందేలపై దాడులు చేసి ఇద్దరు వ్యక్తులు, రెండు పందెం కోళ్లు, రూ.వెయ్యి నగదును సీజ్ చేసినట్లు ప్రకటించారు. చెరుకుపల్లి మండలం రాజోలులో కూడా ముగ్గురు జూదగాళ్లను అదుపులోకి తీసుకొని, రెండు పందెం కోళ్లను పట్టుకున్నారు. వేమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జంపని వద్ద ఏర్పాటుచేసిన బరులను ధ్వంసం చేశారు. కానీ 30 ఎకరాల్లో తూర్పుపాలెం వద్ద, 20 ఎకరాల్లో మంతెనవారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన బరులు పోలీసులకు కనిపించడం లేదు. దీంతో అధికారం అండగా నిర్వహిస్తున్న కోడిపందేల బరుల వద్దకే జూదరులు వెళుతున్నారు. చట్టాలు అనేవి రాజకీయ నాయకులకు చుట్టాల్లా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పింఛన్ ఉంటుందా.?

(మొదటిపేజీ తరువాయి)

సర్టిఫికెట్‌కు రూ.20 వేల నుంచి 30 వేల వరకూ వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. డబ్బులు తీసుకొని సర్టిఫికెట్లు ఇచ్చారనే విమర్శలు కూడా కొందరు డాక్టర్లపై వచ్చాయి. వెరిఫికేషన్‌లో ఇలాంటివన్నీ పోయే ప్రమాదం ఉంది. ఈ నెల 25 లోపు వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంది. వచ్చే నెల 1వ తేదీ ఇచ్చే పెన్షన్లలో అర్హులు ఎవరు? కానివారెవరు? అన్నది తేలనుంది. ఇక వీటితో పాటు సాధారణ పెన్షన్లలోనూ బోగస్ ఉన్నట్లు కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. వాటిని కూడా పరిశీలిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా సంతనూతలపాడు మండలంలో ఈ ప్రక్రియను చేపట్టారు. జిల్లా అంతటా భోగస్ పెన్షన్‌దారులను గుర్తించి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మరో వైపు పెన్షన్లలో అర్హులకు ఎవరికీ అన్యాయం జరగదని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి భరోసా ఇచ్చారు. ఇక బోగస్ వాటిపై వెరిఫికేషన్ కొనసాగుతున్న నేపథ్యంలో కొత్తగా పెన్షన్లకు దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదు. దీంతో అర్హులై కూడా లబ్ధి పొందడానికి వీల్లేకుండా పోయింది. ఈ ఆరు నెలల్లో భర్తలను కోల్పోయిన చాలామంది మహిళలకు పెన్షన్ రావడం లేదు. ఆన్‌లైన్‌లో అనుమతి ఇస్తే గానీ అధికారులు దరఖాస్తులు స్వీకరించే అవకాశం లేదు.

పల్లెకు రయ్..రయ్..

(మొదటిపేజీ తరువాయి)

ట్రావెల్స్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, తిరుపతి, విజయవాడ వంటి ప్రాంతాలకు టిక్కెట్ ధరలను అమాంతం రెట్టింపు చేశాయి. రైళ్ళు, ఆర్టీసి బస్సులు దొరకని ప్రయాణీలకు తప్పనిసరి పరిస్థితులలో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలలో ఉద్యోగాలు చేస్తున్న కొందరు ప్రైవేట్ ట్రావెల్స్‌లో సొంత గ్రామాలకు రావటం గమనార్హం.

వివేకానంద మాట..స్ఫూర్తి బాట..

(మొదటిపేజీ తరువాయి)

నడపడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించిందన్నారు. ఇటీవల తాను రూపొందించిన విజన్ డాక్యుమెంటులో ఈ కోణంలో ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. యువజన దినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు అతిథులు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు , నెహ్రూ యువ కేంద్రం అధికారి కమల్ సా, జిల్లా యువజన సంక్షేమ శాఖ-స్టెప్ సిఈఓ శ్రీమన్నారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి



దుస్తులు పంపిణీ చేస్తున్న శిద్దా రాఘవరావు

రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు గోల్డెన్ గ్రానైట్స్, కామాక్షి గ్రానైట్స్ కార్మికులు, ఉద్యోగులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం గోల్డెన్ గ్రానైట్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆయన దుస్తులు పంపిణీ చేశారు. స్వీట్లు పంపిణీ చేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోల్డెన్ గ్రానైట్స్ జనరల్ మేనేజర్ ఏ గిరిబాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా తమ గ్రానైట్స్‌లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. సందర్భంగా కార్మికులు మరియు ఉద్యోగులు శిద్దా రాఘవరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కామాక్షి గ్రానైట్స్ ప్రతినిధి శిద్దా శ్రీనివాసరావు, ఫస్ట్ క్లాస్ మేనేజర్ ఫణికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని ముప్పవరం జడ్‌పిహెచ్ స్కూల్‌లో 1974-75, 1975-76, 1976-77 పదో తరగతి మూడు బ్యాచ్‌ల విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఆనాటి గురువర్యులను సత్కరించారు. దాదాపు 51 సంవత్సరాల తర్వాత నాటి విద్యార్థినీ విద్యార్థులంతా ఒక్క చోట కలిశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. ముందుగా మూడు బ్యాచ్‌ల ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకొని ఆనందడోలికల్లో తేలియాడారు. సుమారు 70 మంది నాటి విద్యార్థులు నేడు తమ కుటుంబ సభ్యులతో ఒక్కచోటికి చేరారు. వీరంతా కలిపి మొత్తం సుమారు 200 మంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఆనందభరితులయ్యారు. తమ గురువులైన తెలుగు మాస్టర్ హరిముకుందారెడ్డి, పిఈటి చెంబేటి సుబ్బారావు, సైన్సు మాస్టర్ జి శ్రీనివాసరావు, లైబ్రరీ మాస్టర్ నరసింహారావులను సత్కరించారు. అనంతరం ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో మూడు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు , వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి-కొండపి



సిఐ సోమశేఖర్

కొండపి సర్కిల్ పరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, గ్రామాలు, గ్రామ శివార్లు, ఇతర ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఈ కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా లేదా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు తోడ్పడినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని కొండపి సిఐ జి సోమశేఖర్ తెలిపారు. 'సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు ప్రతీక. దాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ జరుపుకోవాలని అన్నారు. కానీ కోడి పందేలు, జూదాలు వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సమాజాన్ని దెబ్బతీయడం మాత్రమే కాదు, ఎన్నో కుటుంబాల జీవితాలను నాశనం చేస్తాయని, మన యువత ఈ అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలి అని సిఐ పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం, పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసే సమయంలో కేసులు అడ్డంకిగా మారతాయి అని తెలిపారు.

దశదిన కర్మలో మంత్రి స్వామి

ప్రజాశక్తి-కొండపి



సుబ్బమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి

కొండపి మండలం పెరిదేపి గ్రామంలో సోమపల్లి సుబ్బమ్మ దశదినకర్మ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో మాట్లాడారు. సుబ్బమ్మకు నివాళులర్పించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, మాజీ ఏఎంసి చైర్మన్ జి రామయ్యచౌదరి, నరసారెడ్డి, దామా మురళి, ఏజండ్ల రవీంద్ర, గ్రామ నాయకులు చెన్నారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రావిపాటి వెంకటరావు, సుదాకర్, సోమపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నాలుగో రోజు ఆరు మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో ప్రారంభించిన నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటులో నాలుగో రోజు ఆరు మ్యాచ్‌లు ఆడించినట్లు ఎన్‌ఆర్‌కే యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో రెడ్డిపాలెం- కుమ్మరిపాలెం మధ్య మ్యాచ్ జరగగా రెడ్డిపాలెం టీం గెలుపొందిందని, మంగమూరు-శింగరాయకొండ టీంలకు మ్యాచ్ జరగగా మంగమూరు టీం గెలుపొందిందని, అంబేద్కర్ యూత్‌ఫోర్స్- పందలపాడు టీంలకు మ్యాచ్ జరగగా అంబేద్కర్ యూత్‌పోర్స్ టీం గెలుపొందిందని తెలిపారు. అలాగే పీరాపురం- మనిలెవెన్స్ టీంలకు మ్యాచ్ జరగగా పీరాపురం టీం గెలుపొందిందని, జాళ్లపాలెం- యక్సాజ్ లెవెన్సు టీంలకు మ్యాచ్ జరగగా అందులో జాళ్లపాలెం టీం గెలుపొందిందని, మాబు లెవెన్సుకి - కట్టుబడిపాలెం టీంలకు మ్యాచ్ జరగగా మాబు లెవెన్సు టీం గెలుపొందిందని కమిటీ సభ్యులు తెలిపారు.

మకర తోరణానికి గ్రామోత్సవం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడులోని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మకర తోరణానికి ఆదివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. చీరాల వాస్తవ్యులు చీమకుర్తి శ్రీనివాసరావు, వసంత దంపతులు కళ్యాణ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి 1,70,000 రూపాయల విలువచేసే మకర తోరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా మొదట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి మకర తోరణానికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పి అజయ్‌బాబు, వేద పండితులు పి శేష వరప్రసాదచార్యులు, పి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో దాత సిహెచ్ శ్రీనివాసరావు అందించిన మకర తోరణానికి సంప్రోక్షణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో దాత శ్రీనివాసరావు కుటుంబీకులు కారంశెట్టి లక్ష్మణరావు, అనంత పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని భార్యని తన ఇద్దరు తమ్ముళ్లతో కలిసి హత్యకు కుట్ర పన్నాడు. స్కూటీపై తన మనుమరాలితో వెళ్తున్న భార్యను టిప్పర్‌తో ఢీకొట్టగా మనుమరాలు మృతి చెందగా భార్య గాయాలతో బయట పడింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనపై బాధితులరాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కుట్రను ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు వివరాలు వెల్లడించారు.

కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈర్నపాటి సుబ్బులక్షమ్మకు ఈర్నపాటి పెద్ద వెంకటేశ్వర్లుతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన తిప్పనబోయిన వెంకట నారాయణతో సుబ్బులక్ష్మమ్మ అక్రమ సంబంధం జరుపుతుందనే అనుమానంతో సుమారు 20 సంవత్సరాల క్రితం పెద్ద వెంకటేశ్వర్లు తన తమ్ముళ్లు అయిన చిన్న వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్యలతో కలిసి వెంకట నారాయణను హత్యచేసి 9 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి 2019 సంవత్సరంలో జైలు నుంచి బయటికి వచ్చారు. ఆ తర్వాత కూడా పద్ధతి మార్చుకోకుండా సుబ్బులక్ష్మమ్మ మరొకరితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ కుటుంబం పరువు తీస్తుందని, ఆస్తి విషయంలో తరచూ తమతో గొడవ పడుతూ ఉండేదని, అదేవిధంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుందన్న కారణంతో ఆమె భర్త పెద్ద వెంకటేశ్వర్లు అతని ఇద్దరు తమ్ముళ్లతో కలిసి కుట్ర పన్నారు. పథకం ప్రకారం ఈనెల 9వ తేదీన కోమటి కుంట జంక్షన్ నుంచి జమ్మనపల్లి వెళ్ళే రోడ్డులో కోమటి కుంట జంక్షన్‌కు సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో సుబ్బులక్ష్మమ్మ, ఆమె మనుమరాలు ఏడుమల్ల రాదా స్కూటీ మీద వెళ్తుండగా చిన్న వెంకటేశ్వర్లు టిప్పర్ లారీతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాదా తలకు గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సుబ్బులక్షమ్మ చనిపోక పోవడంతో చిన్న వెంకటేశ్వర్లు టిప్పర్ దిగి, కర్ర తీసుకొని ఆమెను చంపబోతుండగా జనాలు రావడం గుర్తించి అక్కడినుండి పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు, మార్కాపురం డీఎస్పీ డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మార్కాపురం, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు సైదు బాబు అంకమ్మరావు వారి సిబ్బంది బృందాలుగా ఏర్పడి, నిందితుల కోసం గాలిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, పెద్ద వెంకటేశ్వర్లు తన ఇద్దరి తమ్ముళ్ళతో కలిసి కుట్ర పన్నినట్లు ఒప్పుకున్నారు. చిన్న వెంకటేశ్వర్లు, వెంకట రమణయ్యలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. హత్యకేసులో త్వరితగతిన పురోగతిని చూపించి, హత్య జరిగిన రెండవ రోజే ముద్దాయిలను అరెస్ట్ చేయుటలో ప్రతిభ చూపిన సిబ్బందిని జిల్లా ఎస్పీ దామోదర్ అభినందించినారు.

ఇంకొల్లులో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లుకు చెందిన పాటిబండ్ల నరేంద్ర అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు నరేంద్ర నేత్రాలను దానం చేశారు. భార్య అంజనాయమ్మ కుమార్తెలు, అల్లుళ్ల ఆధ్వర్యంలో పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కార్నియాను సేకరించారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ అవయవ దానం జరిగింది.

14న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-ఇంకొల్లు

గంగవరం గ్రామంలో కీర్తిశేషులు మంచాల రవికుమార్ జ్ఞాపకార్థం 14వ తేదీన ఆంజనేయ స్వామి బొమ్మ వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాలచంద్ర తెలిపారు. 14న సాయంత్రం ఏడు గంటలకు గంగవరానికి చెందిన వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో పలు సాంస్కృతిక ప్రదర్శనలు, విజయవాడకు చెందిన మైత్రి కళా నిలయం వారిచే బ్రహ్మ స్వరూపం అనే నాటిక ఎనిమిది గంటలకు ప్రదర్శించ బడుతుందని తెలిపారు. అదేవిధంగా సాయంత్రం తొమ్మిది గంటలకు కరి మదనమోహన్‌రావు జ్ఞాపకార్థం హైదరాబాద్ చెందిన కళాంజలి వారిచే రైతే రాజు నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. అనంతరం తిరిగి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - చీరాల

చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలుర హైస్కూల్ క్రీడమైదానంలో ఆదివారం జరిగిన ఈపూరు పాలెం పోలీసులు వర్సెస్ చీరాల మీడియా ప్రతినిధుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సహభరితంగా సాగింది. మొదటిగా టాస్ గెలిచిన ఈపూరుపాలెం పోలీసుల జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంది. 10 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 113 స్కోర్ చేసింది. 114 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చీరాల మీడియా టీం మొదటిలోనే రెండు కీలక వికెట్లను కోల్పోయింది. ఒక్క వైపు వికెట్లు కోల్పోతున్నప్పటికీ జర్నలిస్టులు దిలీప్, సూర్యప్రకాష్ స్కోర్ బోర్డుని పరుగులు పెట్టించారు. చివరికి 113 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. చీరాల మీడియా టీంకి ప్రదీప్ కెప్టెన్‌గా వ్యవహరించగా ఈపూరుపాలెం పోలీస్ టీంకి ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటు మీడియా అటు పోలీసులు రెండు కూడా వృత్తిపరంగా ఎంతో ఒత్తిడితో కూడిన బాధ్యతలన్నారు. ఒత్తిడిని పారద్రోలేందుకు గాను ఈ తరహా క్రీడలు దోహదపడతాయన్నారు .ఈ నేపథ్యంలో మీడియా పోలీస్ శాఖకు మంచి ఫ్రెండ్లీ వాతావరణం ఏర్పడుతుందన్నారు. తద్వారా సమాజానికి ఎంతగానో మేలుచేకూరుతుందన్నారు. క్రికెట్‌లో పాల్గొన్న మీడియా ప్రతినిధులు అందరికీ అయన కృతజ్ఞతలు తెలిపారు.

లారీని ఢీకొట్టిన బస్సు

8 మందికి గాయాలు



క్షతగాత్రులకు వైద్యం చేస్తున్న సిబ్బంది



దెబ్బతిన్న బస్సు ముందుభాగం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శింగరాయకొండ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగింది. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కావేరి ట్రావెల్స్ ప్రైవేటు బస్సు శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని జీవీఆర్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ముందు వెళుతున్న లారీని బలంగా బస్సు ఢీకొట్టాడు. బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా 8 మందికి డ్రైవర్‌తో సహా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎస్ఐ బి.మహేంద్రతో పాటు హైవే పెట్రోలింగ్ వాహనం 108 వాహనం చేరుకొని గాయపడిన వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. తిరుపతి ప్రాంతంలో ఉద్యోగాలు చేస్తున్న వారంతా హైదరాబాదుకు సంక్రాంతి పండక్కు వెళ్తున్నారు. గాయపడిన వారంతా హైదరాబాదుకు చెందిన వారే. బస్సు డ్రైవర్ మేడిపోయిన మురళీకృష్ణకు తీవ్ర గాయాలు కాగా అదే బస్సులో ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లాకు చెందిన చనిగల మహేష్, హైదరాబాద్ చెందిన ఈదుల మురళీధర్, పతంగి సూర్యప్రకాష్, పతంగి రామ్ కుమార్, తండ్రి కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాదుకు చెందిన గణిత్ నావునాక్, మరక వీరేందర్, కాళహస్తికి చెందిన సూరాతి విజయ సాయికుమార్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో ట్రావెల్స్ బస్సు ముందు మొత్తం పూర్తిగా దెబ్బతింది. తెల్లవారుజామున ఈ సంఘటన జరగడంతో జాతీయ రహదారిపై ఎలాంటి ట్రాఫిక్‌కు ఇబ్బంది జరగకుండా బస్సును పక్కకు తరలించి పోలీసులు ఇబ్బందులు లేకుండా చేశారు. బస్సులో గాయపడిన ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐబి మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు మంత్రి గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పట్టణ మరియు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. కలవకూరు గ్రామంలోని తన్నీరు ఏడుకొండలు, సింగరకొండ గ్రామానికి చెందిన అర్చకులు కోట శ్రీరామచంద్రమూర్తి, పట్టణంలోని ఒకటవ వార్డుకు చెందిన దామవారిపాలెం వేముల ప్రసన్న బాబు, ఏడో వార్డులోని నర్రవానిపాలెం నరసింవయ్య కుటుం సభ్యులను, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివయ్యను పరామర్శించారు. ఈ కార్యక్ర మంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేషు, పరిటాల ఆదినారాయణ, సింగరకొండ దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణ అధికారి ఎం.తిమ్మనాయుడు, ఆలయ అర్చకులు వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు: పంగులూరు మండలంలోని పలు కుటుంబాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని ర్యాంనింగవరం గ్రామంలో ఇటీవల కొరిశపాడు వద్ద జరిగిన కారు ప్రమాదంలో మరణించిన అన్నపురెడ్డి వెంకట కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. అదే గ్రామంలోని మట్ట కొయ్య ఒక్కయ్య అనారోగ్యంతో మరణించగా ఆదివారం దశదినకర్మకు పాల్గొని అనంతరం సంపతి రోశయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ముప్పవరం గ్రామంలో దూళిపాళ్ల భావనారాయణ తల్లి నాగరత్నమ్మ మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్య క్రమంలో నాయకులు బోరెడ్డి ఓబుల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్రీ వెంకటసుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, కుక్కపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

బల్లికురవ: మండలంలోని అంబడుపూడిలో ఆంజనేయులు ఇల్లు విద్యుత్ ప్రమాదంలో దగ్ధమైంది. ఆ కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. నష్టపోయిన ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట క్లస్టర్ ఇంచార్జి మల్లినీడి గోవిందరావు, సర్పంచ్ కుమారి, టిడిపి నాయకులు దద్దాల అంజయ్య, విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్ రావు, ఏఈ శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ మండల సుధాకర్, వీఆర్వో రవికుమార్, నీటి సంఘం నాయకులు దద్దాల విజయ్ తదితరులు ఉన్నారు.

బైక్‌ని ఢీకొన్న కారు

వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

బైక్‌ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరులో ఆదివారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. బల్లికురవ మండలంలోని గంగపాలెం గ్రామానికి చెందిన చిగురుపాటి శివయ్య కుటుంబ సభ్యులతో గత కొంతకాలంగా మార్టూరులో నివాసం ఉంటున్నారు. కూరగాయలు తీసుకురావడానికి పెద్ద మార్కెట్‌కి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద గుర్తుతెలియని కారు అతివేగంగా వెళుతూ శివయ్య బైక్‌ను ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళిపోయాడు. ఈ ఘటనలో రోడ్డుపై పడిన శివయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్టూరు పోలీసులు తెలిపారు

కోడిపందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి-వేమూరు

కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. వేమూరు మండలం జంపని చక్కర కర్మగారం పక్కన నిర్వహిస్తున్న పందేల ఏర్పాట్లను వేమూరు సిఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. కొల్లూరు మండలం క్రాప్ అడ్డరోడ్డు వద్ద జరుగుతున్న కోడి పందాల ఏర్పాట్లను కూడా పోలీసులు ధ్వంసం చేశారు. అనంతవరం వద్ద కూడా భారీ స్థాయిలో ఏర్పాటుచేసిన కోడిపందాల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇదిలా ఉండగా జంపని గ్రామ శివారు పొలాల్లో కోడి పందేల ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి కోళ్లు, రూ.1,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఆంజనేయులు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని దొడ్డవరం గ్రామంలో బొడ్రాయి సెంటర్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న ఓ ఇంటి వద్ద తనిఖీలు చేసి 48 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

పొదుపుతో ఆర్థిక ప్రగతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రతి ఒక్కరు పొదుపు చేసుకుంటే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని సర్టిఫైడ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ జన్‌మని జిఎం వేణుగోపాల్ అన్నారు. ఆదివారం శింగరాయకొండ సాయిబాబా దేవస్థానం ఎదురుగా ఉన్న ఎస్వీ కళ్యాణ మండపంలో జన్‌మణి మీరే అసెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జనరల్ మేనేజర్ వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి జీవిత బీమాతో పాటు ఆరోగ్య బీమా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మీరే అసెట్ మేనేజర్ రామ్ విక్రమరెడ్డి, బ్రాంచి నిర్వాహకులు మందలపు శ్రీనివాసరావు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎవరైనా కోడిపందాలు, జూదం వంటివి నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పట్టాభి రామయ్య హెచ్చరించారు. అంతేగాక నిషేధిత జూద క్రీడలు నిర్వహించడం, ప్రోత్సహించడం చేయకూడదన్నారు. వీటిని ఆడేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా గ్రామాలలో కోడి పందేలు ఆడేందుకు స్థలాలు ఇచ్చినా, పాల్గొన్నా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-ఇంకొల్లు

గంగవరం గ్రామంలో మహాలక్ష్మి చెట్టు వద్ద 14, 15వ తేదీలలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 35వ వార్షికోత్సవం పురస్కరించుకొని కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు యనమంద్రు కృష్ణమోహన్ తెలిపారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు, నాలుగో బహుమతిగా రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.



హోరాహోరీగా తలపడుతున్న జట్లు

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండలంలో రావినూతలలో జరుగుతున్న 31వ సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం కూడా రెండు చెన్నై జట్లే విజయాలు సాధించాయి. సౌత్ జోన్ సిసి చెన్నై, లైన్స్ సిసి బెంగళూరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్టు జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు విజయం సాధించింది. బెంగళూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. సిసి చెన్నై జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 142 పరుగులను చేసింది. అనంతరం 143 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లను కోల్పోయి 141 పరుగు మాత్రమే చేసి ఒక్క పరుగు అపజయాన్ని మూటగట్టుకుంది. మధ్యాహ్నం జరిగిన రెండవ మ్యాచ్‌లో వైట్ ఫీల్డ్ సిఏ లెవెల్ బెంగళూరు, జిఎస్‌టిసి చెన్నై జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వైట్ ఫీల్డ్ చెన్నై జట్టు 17.1 ఓవర్లలో కేవలం 54 పరుగులు చేసింది. 55 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జిఎస్టి అండ్ సీఈ చెన్నై జట్టు 9.2 ఓవర్లలోనే 5 వికెట్లను కోల్పోయి 55 పరుగుల విజయ లక్ష్యాన్ని సాధించింది. సోమవారం ఉదయం ఇండియన్ బ్యాంక్ చెన్నై వర్సెస్ చెన్నై జట్ల మధ్య, మధ్యాహ్నం రెండో మ్యాచ్ ఎస్కేయంసిసి చెన్నై వర్సెస్ జిఎస్టి సీఈ 11 చెన్నై జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నాయి.



పెవిలియన్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

పెవిలియన్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-మేదరమెట్ల

రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్టేడియంలో రూ.92 లక్షల రూపాయలతో నిర్మించిన పెవిలియన్ భవనాన్ని ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి గ్రామీణ వాతావరణంలో ఇంతటి గొప్ప స్టేడియంను ఏర్పాటు చేసిన ఆర్‌ఎస్‌సిఏ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ స్టేడియం ఏర్పాటు కోసం శ్రమించిన అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులను ఆయన అభినందించారు. ఈ స్టేడియం అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌సిఏ అధ్యక్షులు కారుసాల నాగేశ్వరరావు, మువ్వతిలక్, మోపర్తి శేషారావు, ప్రముఖ సినీ నటులు రఘుబాబు, యడ్లపల్లి నరసింహారావు, కారూసాల బ్రహ్మానందం, కారుసాల సుబ్బయ్య, పునాటి వెంకటరావు, శివకుమార్, నాగబోయిన శ్రీనివాసరావు, పిన్నక్క రవి, బి.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాస్, పుట్ట చక్రవర్తి, నాగార్జున, జాగర్లమూడి జయకృష్ణ, జాగర్లమూడి వీరాంజనేయులు, సాధినేని మస్తాన్‌రావు, అన్నంగి దేవ సహాయం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లు మండలంలోని గంగవరం గ్రామంలో మంచాల వెంకటరామయ్య, వెంకట రంగమ్మ విద్యా వైద్య వైజ్ఞానిక కళ్యాణ మండపంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 125 మంది రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ మంచాల రమేష్, డాక్టర్ సాంబయ్య, జనరల్ ఫిజిషియన్ ఆదిత్య వర్మలు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరానికి మద్దాలి గిరిధరరావు, రంగమణి, సరళ కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం అందజేశారు.

ప్రజా పోరాటయోధుడు 'శామ్యూల్'

ఆయన మృతి ఉద్యమాలకు తీరని లోటు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి



మాట్లాడుతున్న ధనలక్ష్మి



శామ్యూల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పట్టణ సీఐటీయు నాయకులు, కామ్రేడ్ జంగం శామ్యూల్ మృతి బాపట్ల ప్రాంత కార్మిక, ప్రజా సంఘాల ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జంగం శామ్యూల్ సంతాప సభను సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. సిఐటియు నాయకులు తిరుమలరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి మాట్లాడుతూ కార్మిక ఉద్యమంలో శామ్యూల్ చిరస్మరణీయుడన్నారు. తుదిశ్వాస విడిచే వరకు కార్మిక సమస్యలపై పోరాడిన ఉద్యమ యోధుడు శామ్యూల్ అన్నారు. ఆర్టీసీలో పనిచేస్తూ కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. ప్రజల్ని చైతన్యపరచడం సీఐటీయూ నిర్వహించే ఆందోళనకు కార్మికవర్గాన్ని సమీకరించటంలో శామ్యూల్ ముందున్నాడన్నారు. కార్మికులను, ప్రజలను పోరాటాల్లో భాగం చేసేవారన్నారు. కార్మికులందరికీ సమానవేతనం ఉండాలని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నం భోజనం, తదితర పోరాటాల్లో జరిగే ఉద్యమాల్లో చురుకైన పాత్ర వహించాడన్నారు. శామ్యూల్ ఆశయాలు సాధన కోసం పనిచేయడమే శామ్యూల్‌కు నిజమైన నివాళి అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ స్కీములో పని చేస్తున్నపుడు సమస్య మీద పోరాటంతో సిఐటియు ఉద్యమంతో ఏర్పడిన అనుబంధం తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండాను వదలకుండా కార్మికులు, కర్షకులు సమస్యలపై పోరాడారని తెలిపారు. బాపట్ల ఆర్టీసీ డిపో పరిధిలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నేతగా, అంగన్వాడి, ఆశవర్కర్ల, ఆటో, రిక్షా కార్మికులు సమస్యలపై పోరాటాలు నిర్వహించారన్నారు. ఈయన మృతి బాపట్ల జిల్లాలో ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు.

సభలో సిఐటియు, పలు ప్రజాసంఘాలు నేతలు శామ్యూల్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. తొలుత శామ్యూల్ చిత్రపటానికి పూలమాల వేసిననివాళులర్పించారు. సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. మణిలాల్, ఎస్ డబ్ల్యు ఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి, నాయకులు మున్నంగి కుమార్, వై.శ్రీనివాస్,కె.శరత్, నూతల పాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, బుచ్చిరాజు, నిరంజన్, రవి కిరణ్, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు ఎం.వెంకటేశ్వరమ్మ, ఐద్వా నాయకులు, టి.సుభాషిని, శామ్యూల్ సతీమణి సునీత, కుమార్తెలు స్పందన, స్రవంతి, ఆయన సోదరులు ఇస్సాకు, యాకోబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పర్చూరు ప్రగతే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు - రూ.85 లక్షలతో నిర్మించిన రోడ్లు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నియోజకవర్గ సమగ్రాభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం పర్చూరు, కారంచేడు మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పర్చూరు నగరంలో రూ.85 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం పర్చూరు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మహాప్రస్థానాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. అలాగే అంతర్గత సిమెంట్ రోడ్లు ప్రహరీ, మహా శివలింగం తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్ర భాగాన నిలపాలనే దృఢ సంకల్పంతో అహర్నిశలు శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి సంక్షేమాన్ని జోడెద్దులా పరుగులు తీయిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేశానని మళ్లీ అభివృద్ధి పునర్నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. ఆరు నెలల కాలంలో చంద్రబాబు ఆశీస్సులతో వేలాది కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. స్టేట్ హైవేలను జాతీయ హైవేలుగా మార్చేలా శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. పర్చూరులో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాప్రస్థానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధికి బాధ్యతగా కార్యక్రమాలు చేపడుతున్న కమిటీని ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు అభివృద్ధి పనులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. పర్చూరు నగరంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయాన్ని ఎమ్మెల్యే ఏలూరి సందర్శించారు.

కుటుంబాలకు బాసటగా ఎమ్మెల్యే ఏలూరి..

పర్చూరు నగరంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ఏలూరి వారికి అండగా నిలిచారు. కుటుంబాలకు నేనున్నానని భరోసా కల్పించి ధైర్యంగా ఉండాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందిన దాసరి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య




వివేకానందకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

వివేకానందుడి బోధనలు యువతకు స్ఫూర్తిమంత్రాలు అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ దగ్గర వివేకానంద విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పర్వదినాన్ని భారతీయులు ప్రతి సంవత్సరం జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడని, వేదాంత, యోగ తత్త్వ శాస్త్రాలకు సంబంధించి సమాజంలో అత్యంత ప్రభావాన్ని కలిగించిన ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త వివేకానందుడు అన్నారు. స్వామి వివేకానంద 125 ఏళ్ళ క్రితం చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళన సభలో ఆయన చేసిన అనితరసాధ్యమైన ప్రసంగం గుర్తుకు తెచ్చుకుంటే ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయన్నారు. ఆంగ్లభాషలో స్వామి వివేకానందుని ప్రసంగానికి అమెరికా ప్రజానీకం నీరాజనాలు పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: స్వామి వివేకానంద జయంతి వేడుకలను బట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామ వేణుగోపాల స్వామి దేవస్థానం ఆవరణలో వివేకానంద విద్యా గ్రామీణ అభివృద్ధి సంస్థ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించారు. తొలిత గ్రామ పురవీధులలో వివేకానంద శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన వివేకానంద జయంతి సభలో వక్తలు మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక అన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువతతో దేశం సర్వముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా వివేకానంద పురస్కారం 2025 ఉత్తమ ఉపాధ్యాయులు, సంగీత విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్త అయిన మరదాప కోటేశ్వరరావుకు అందజేశారు. కోటేశ్వరరావు దంపతులను శాలువాతో, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు జంజనం హేమశంకరరావు, సంస్థ కార్యదర్శి జంజనం జ్యోతిలక్ష్మి, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బండారు శ్రీనివాసరావు, పడమట వెంకటేశ్వరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, వామనపల్లి కోటేశ్వరరావు, వేల్పూరి శ్రీనివాస్, దీపాల శివప్రసాద్, మాచర్ల తులసి రంగారావు, మున్నం చిన సుబ్బారెడ్డి, వీరాస్వామిరెడ్డి, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: స్థానిక వినాయక నగర్‌లో ఆదివారం వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ స్వామి వివేకానంద నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. అనంతరం 150 మంది పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చలపతి, గడ్డం సురేష్ పాల్గొన్నారు.



కోటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అసమానతలు తొలగాలి

ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సమాజంలో నెలకొన్న అసమానతలు తొలగినప్పుడే సమాజం అభివద్ధి చెందుతుందని వెంకటరమణ నర్సింగ్ హోమ్ వైద్యులు కె.చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఎల్‌బిజీ భవన్‌లో కెవిపిఎస్ -2025 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమాజంలో అంతరాలు తొలగించేందుకు కెవిపిఎస్ సాగిస్తున్న ఉద్యమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి కపారావు మాట్లాడుతూ సామాజిక అంతరాలు తొలగించేందుకు కెవిపిఎస్ చేస్తున్న కృషి పట్ల అభినందనలు తెలిపారు. కెవిపిఎస్ వ్యవస్థాపక కన్వీనర్ జాలా అంజయ్య మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థను కాపాడుకునేందుకు కెవిపిఎస్ కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో డిఇ డి.సుధీర్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ కొప్పోలు సుబ్బారావు, అడ్వకేట్ అడ్డగబొట్టు సుధాకర్, కెవిపిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జవ్వాజి రాజు, బి రఘురామ్, ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, వి మోజెస్, టి రామారావు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సిఎస్ఆర్ శర్మ కళాశాలలోని ఆయన విగ్రహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్వామి వివేకానంద యువతకు మార్గదర్శకుడని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, అధ్యక్షులు ఈదర వెంకటేష్, కార్యదర్శి గ్రంధే పార్థసారధి, కోశాధికారి లక్ష్మణ స్వామి, క్లబ్ పూర్వ అధ్యక్షులు పల్లపు సుబ్బయ్య, తమ్మన ఆంజనేయులు, అబ్బిశెట్టి జనార్ధన, తమ్మన ఆంజనేయులు, పోకూరి నవీన్ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: వివేకానంద అడుగుజాడల్లో నడవాలని వివేకానంద సేవా సమితి నాయకులు చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం పట్టణంలోని 565 జాతీయ రహదారి డివైడర్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద 162వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీదెళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో ఆతుకూరి రామయ్య, మాదాల సూర్య నారాయణ, సూరె వెంకటస్వామి, దొంతా బాదరయ్య గౌడ్, గ్రంధిశీల సూర్యం, అనిశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల జీతాలు పెంచాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అపార్ట్‌మెంట్ కాపలాదారులకు జీతాలు పెంచాలని రజక వత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఒంగోలు నగర వాచ్‌మెన్ అసోసియేషన్ 2025 కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక వృత్తి దారుల సంఘం అధ్యక్షులు టంగుటూరు రాము, ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉలిచిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రూరల్ మండలం ఉలిచి గ్రామంలో ఉలిచి అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఈ నెల 13, 14, 15 తేదీలలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు గార్లపాటి రామారావు తెలిపారు. ఆదివారం ఉలిచిలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కార్యక్రమ వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గార్లపాటి రామారావు, చుంచు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏఎన్నార్. ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు, ట్రగ్ ఆఫ్ వార్, షాట్ పుట్, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటితో పాటుగా పక్కింటి మొగుడు నాటకం, పడమట గాలి నాటకం ప్రదర్శన జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ఆయన సతీమణి దామచర్ల నాగసత్యలత, ప్రముఖ సినీ దర్శకులు మలినేని గోపీచంద్, చదువుల తల్లి బాలలత పాల్గొంటారన్నారు. సమావేశంలో ఆంజనేయులు, చప్పిడి రవీంద్రబాబు, బొద్దులూరి రామారావు,బొద్దులూరి హనుమంతరావు, చేజర్ల వెంకట్రావు, చుంచు రామకష్ణ, ఇనగాల చక్రపాణి, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు అడ్డుకుంటాం

కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి బిఆర్ గౌస్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చటానికి చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బిఆర్ గౌస్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగం విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ ఆదివారం నగరంలోని రెండో డివిజన్‌లో రాజ్యాంగ పీఠిక పత్రులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒంగోలు మండల అధ్యక్షుడు తెలగలపూడి బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ గౌస్ మాట్లాడుతూ, దేశంలో విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులను ఒక్కటిగా రాజ్యాంగం చేసిందని, జాతి, కుల, లింగ వివక్ష లేకుండా ప్రజలందరికి సమాన హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాయపాటి గిడ్యోన్, ప్రకాశం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్, యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నాగ కుమార్, నాయకులు షేక్ కరీం భాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



బహుమతుల ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు ఆదిలక్ష్మి

సంక్రాంతి పండుగ సందర్భంగా ఒంగోలు నగర పరిధిలోని 50వ డివిజన్ చైతన్య కాలనీలో ఆదివారం నాడు సంక్రాంతి ఆటలపోటీలు ఘనంగా నిర్వహించారు. ఐద్వా, డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి, ప్రజాశక్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు, యువతీయువకులు, బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలకు క్లాత్ గేమ్, ముగ్గుల పోటీ, మ్యూజికల్ చైర్స్, యువతకు కబాడీ, బాలబాలికలకు పరుగుపందెం , లెమన్ అండ్ స్పూన్ వంటి ఆటలు నిర్వహించారు. అనంతరం 70 మంది విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఐద్వా చైతన్య కాలనీ కార్యదర్శి డి మధురవాణి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి ఎస్.జ్యోతి మాట్లాడుతూ కాలనీలో పిల్లలకు యోగా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పౌర సంఘాల సమైక్య నగర కన్వీనర్ జీ రమేష్, ఐద్వా నాయకులు డి నాగమణి, అనిత, ప్రత్యూష, సిఐటియు నాయకులు సిహెచ్ రామయ్య, సిహెచ్ రామారావు పాల్గొన్నారు.



త్రోవగుంటలో మాట్లాడుతున్న రఘురాం

త్రోవగుంటలో..

మనుషులంతా ఐక్యంగా ఉన్నప్పుడే నిజమైన సంక్రాంతి అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురాం అన్నారు. ఆదివారం నాడు కెవిపిఎస్, డివైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నగర పరిధిలోని త్రోవగుంటలో నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కెవిపిఎస్ నాయకులు గోళ్ళ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో రఘురాం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ,అట్లూరి రాఘవులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంబి శ్రీనివాసులు, కేవీపీఎస్ నాయకులు కండే నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు మహేష్, మహిళా సంఘం నాయకురాండ్రు విజయలక్ష్మి, కలుగోవాలమ్మ, రాంప్రసాద్ పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న మహిళలు

మహిళలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు గద్దలగుంట గ్రామాభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో గద్దలగుంట రామాలయం వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక మహిళలకు ఆదివారం సాయంత్రం ముగ్గులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణయతగా పీ కష్ణకుమారి డి.శాంతికుమారి, గద్దలగుంట గ్రామ అభివద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు, న్యాయవాది చిట్ట వెంకటేశ్వర్లు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న అధ్యాపకులు

మంత్రి స్వామి అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంలో ఆంధ్రకేసరి జూనియర్ కళాశాల విద్యార్థి రవిశ్రీ శంకర్ రూపొందించిన లైట్ కమ్యూనికేషన్ (ఎల్ఐ-సిఐ) రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించి.. జాతీయ స్థాయి పోటీలకు కూడా వెళ్లారు. ఈ నేపథ్యంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మంత్రి డోలా వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ కళాశాల అధ్యాపకులకు అవార్డు అందజేసి.. అభినందించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సిఐ ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం


సిఐ ప్రభాకర్‌రావు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యర్రగొండపాలెం పోలీస్ సర్కిల్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని గ్రామాలలో, ఇతర ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని యర్రగొండపాలెం సిఐ సిహెచ్ ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు ఒక ప్రతీక అన్నారు. దాన్ని కుటుంబసభ్యులతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పండుగ జరుపుకోవాలన్నారు. ప్రధానంగా యువత అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా కోడి పందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు స్థలాలు ఇచ్చి ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసాంఘిక కార్య కలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నీటి కోసం గిరిజనుల రాస్తారోకో

ప్రజాశక్తి-పెద్దదోర్నాల


రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

మండలంలోని బయన్న గూడెం చెంచు గిరిజనులు నీటి కోసం చిన్న దోర్నాల వద్ద ఖాళీ బిందెలతో రోడ్డు మీద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న డీప్‌బోర్లు మరమ్మతులకు నోచుకోలేదని చెప్పారు. అధికారుల చుట్టూ తిరిగినా, ఇటు ఐటిడిఏ అధికారులు కానీ, అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కానీ పట్టించుకోలేదని వాపోయారు. గత్యంతరం లేక కిమీకు దూరంలో ఉన్న పొలాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. అధికారుల తీరును నిరసిస్తూ ధర్నా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బయన్న గూడెం గిరిజనులు పాల్గొన్నారు.

మంతనాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన చెంచు గిరిజనుల ఆరాధ్యదైవం మంతనాలమ్మకు ఆదివారం ఒంగోలు ఎంపి మాగుంల శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంధర్భంగా రాఘవరెడ్డిని టిడిపి నాయకులు పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జునరెడ్డి, భట్టు సుధాకర్‌రెడ్డి, భట్టు రమణారెడ్డి, అంబటి వీరారెడ్డి, చంటి, శ్రీనివాస యాదవ్, దేవయ్య, జగన్, రామిరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



గన్నెపూడి యోబును సన్మానిస్తున్న కళాపరిషత్

రచయిత యేబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-దర్శి

తెనాలిలో సూపర్ స్టార్ కృష్ణ కాంశ్య విగ్రహ ఆవిష్కరణ, 'సూపర్ స్టార్ సినీ జీవిత శతక రత్న వరాలు' పుస్తక ఆవిష్కరణ ఆదివారం చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, ఆలపాటి రాజా, నాన్నపనేని రాజకుమారి ప్రకాశం జిల్లా దర్శికి చెందిన గన్నెపూడి యోబు రచించిన పుస్తకాను ఆవిష్కరించారు. సూపర్‌స్టార్ కృష్ణ వెండి తెరపై సృష్టించిన అనేక ప్రభంజనాలు, సినీ చరిత్రలో ఏ హీరో చేయని 350చిత్రాలు చేశారని అన్నారు. తొలి తరం హీరోలకు పోటీగా ఒకే సంవత్సరం 15సినిమాలలో నటించిన ఘనుడని అన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు జాలాది మోహన్‌బాబు, తెనాలి అధ్యక్షులు షేక్ షబ్బీర్, రెండు తెలుగు రాష్ట్రాల కృష్ణ అభిమానుల మధ్య వివిఎస్ఎన్ కళాశాల ఎదురు ఘనంగా జరిగినది.

ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - దొనకొండ



హనుమంతరావు

ఆర్య వైశ్య సంఘం మండల కమిటీ ఎన్నికను స్థానిక రామాలయంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోటా హనుమంతరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడిగా బైసాని శేఖర్‌బాబు, అధ్యక్షుడిగా కాళ్ల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా అచ్యుత శివశంకర్, కోశాధికారిగా రాజశేఖర్, మరికొందరు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారంకు తమవంతు బాధ్యతగా పనిచేస్తామని అధ్యక్షుడు హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో మునగా నాగరాజు, కాళ్ల వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పును గౌరవించి.. ఖాళీ చేయాలి

ప్రజాశక్తి - దొనకొండ

ఏబీఎం చర్చికి చెందిన ఆస్తుల విషయంతో గతంలో జరిగిన క్రయ విక్రయాలు చెల్లవని మద్రాసు హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును గౌరవించి కొనుగోలుదారులు ఖాళీ చేయాలని ఏబీఎం చర్చి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత డిసెంబర్ 19న ఏబీఎం చర్చి ఆస్తులకు సంబంధించి గతంలో జరిగిన క్రయ విక్రయాలు చెల్లవని ఒఎస్ నెంబర్ 124/69 కేసును మద్రాసు హైకోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. దొనకొండ ఫీల్డ్‌లోని దర్శి, దొనకొండ ఏబీఎం చర్చి స్థలాలను కొనుగోలు చేసి నిర్మాణాలు చేసిన వారు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేసినవారు చర్చి వారికి అప్పగించాలని పేర్కొన్నారు. కొనుగోలుదారులు నిర్లక్ష్యంవహిస్తే అధికారుల ద్వారా ఖాళీ చేయించి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

నేడు ఆటల పోటీలు

ప్రజాశక్తి - తాళ్లూరు

మండలంలోని బొద్దికూరపాడు గ్రామానకు చెందిన పోలంరెడ్డి చిన్నవీరారెడ్డి ధర్మపత్ని లక్ష్మి నరసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు పోలంరెడ్డి సూరారెడ్డి, అంజిరెడ్డి, రమణారెడ్డి, వీరనాగిరెడ్డి, కుమార్తెలు అంజమ్మ, రమణమ్మ చిన్నమ్మాయి ఆధ్వర్యంలో సోమవారం రామాలయంలో స్లో మోటారు బైక్ రన్నింగ్ రేస్ నిర్వహించి గెలుపొందిన వారికి రు.5116, రూ.రు.3116, రూ.1116 ఇవ్వనున్నట్లు తెలిపారు. 14న 15ఏళ్ల పైబడిన బాలికలకు, స్త్రీలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బొద్దికూరపాడు, చింతలపాలెం గ్రామస్తులు మాత్రమే అర్హులని నిర్వాహకులు తెలిపారు.

బకాయిల విడుదలతో నిజమైన సంక్రాంతి

టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్రంలో ఒకటే సారి రూ.6700 కోట్ల బకాయిల విడుదలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయా లబ్దిదారులు అందరికీ నిజమైన సంక్రాంతి అందించారని తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. ప్రజలు, భిన్న వర్గాల క్షేమంపై సీఎంకున్న ప్రేమ, శ్రద్ధలకు ఇదే నిదర్శనమన్నారు. అయిదేళ్ల వైసిపి హయాంలో రూ.లక్షల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టి పోయారని అన్నారు. అప్పులు, వడ్డీలు కడుతునే ఈ భారాన్ని తీర్చుతూ రావడం చంద్రబాబుకు తప్ప మరొకరికి సాధ్యమయ్యేదే కాదన్నారు. వైసిపి పాలనలో పండగ రోజు కూడా పస్తులు పెడితే ఇప్పుడు పండగకు 2 రోజుల ముందే రూ.వేల కోట్ల నిధులతో అసలైన సంబరాలకు అవకాశం ఇచ్చారని తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు, చిరువ్యాపారుల కళ్లల్లో ఆనందం నింపినందుకు వ్యక్తిగతంగా తనకు ఎంతో సంతృప్తిగా అనిపిస్తోందన్నారు. విద్యార్థులకు రూ.3వేల కోట్లకుపైగా ఫీజులు ఎగ్గొట్టి పోయిన జగన్‌రెడ్డి ఆ పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తుంటే మంత్రి లోకేష్ విజ్ఞప్తి మేరకు 6.5లక్షల మంది పిల్లలకు మేలు చేసేవిధంగా రూ.788కోట్లు విడుదలకు ఆమోదం తెలపడం గమ నించాలన్నారు. చిన్న కాంట్రాక్టర్లు రూ.10లక్షల లోపు పెండింగ్ ఉన్న 26వేల మందికి బిల్లులు చెల్లించాలన్న నిర్ణయం సీఎం చంద్రబాబు మంచి మనసును తెలియజేస్తోందన్నారు. టీడీఎస్ రూ.265కోట్లు, పోలీసుల బకాయిలు రూ.241 కోట్లు, విద్యుత్‌శాఖకు రూ.500కోట్లు, ఆరోగ్యశ్రీ రూ.400 కోట్లు, రైతుల కౌలు బకాయిలకు రూ.241 కోట్లు విడుదల చేశారన్నారు. జగన్ పోతూ రూ.10.50లక్షల కోట్ల అప్పులు నెత్తిన పెట్టినా సంక్షేమాన్ని రెట్టింపు చేసి అందించడం, ఇలా రూ.వేల కోట్లు పెండింగ్ బకాయిలు చెల్లించడం చంద్రబాబుకు మాత్రమే సాధ్యమన్నారు.

17 ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-దర్శి



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థినులు

పట్టణంలోని కాశిం మెమోరియల్ గర్ల్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. 2006-07లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఒక చోట చేరి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుధారాణి ఎలా ఉన్నావు, ఎన్నాళ్లయింది నిన్ను చూసి, నాగ సుజాత నువ్వు ఎలా ఉన్నావు అంటూ ఒకరిని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో తాము చదువుకున్న పాఠశాల దగ్గరకు చేరి ఒకరినొకరు పరిచయం చేసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తరగతిలో చేసిన పనులు, అల్లరి గుర్తుకు తెచ్చుకున్నారు. 17ఏళ్ల తరువాత ఒకచోట కలవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. 10వ తరగతి తర్వాత విడిపోయిన విద్యార్థులు మరల కలవాలనే తలపుతో కొండవీటి సుధారాణి వాట్సాప్ గ్రూప్ తయారు చేశారు. అందులో చదువుకున్న విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించారు. అందరం ఒక చోట చేరుదామని నిర్ణయించుకున్నారు. ఆదివారం వేదికైంది. వ్యవస్థాపకులు మస్తాన్ మాట్లాడుతూ నాటి విద్యార్థులు అందరూ ఒక చోటు చేరి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులందరినీ పిలిచి సన్మానించడం సంతోషదాయకమన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నత శిఖరాలలో అధిరోహించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు రాగలత బేగం, శ్రీను, మోహరూన్నిసా, మిల్టన్ ఖాసిం, ఖాజావలి, వెంకటేశ్వర్లు, సుధాకర్, సుభాని, గురవయ్య, చిరంజీవిలను పూల మాలలు వేసి శాలువా కప్పి జ్ఞాపకం అందజేసి సత్కరించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-దర్శి



బహుమతులు అందిస్తున్న డాక్టర్ కడియాల లలిత సాగర్

పట్టణంలోని అద్దంకిరోడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో బాగంగా ఏర్పాటు చేసిన గొట్టిపాటి, నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు టిడిపి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో 32 టీములు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.1,15,116, ట్రోఫీని అందచేశారు. ద్వితీయ బహుమతి గెలుపొందిన గణేష్ వారియర్స్‌కు డాక్టర్ లలిత సాగర్, చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య రూ.65వేలు, తృతీయ స్థానంలో నిలిచిన డి సెవెన్‌న్యూస్‌కు దారం సుబ్బారావు రూ.45వేలు, 4వ స్థానంలో నిలిచిన దర్శి డిసిఎకు పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మార్తుల యలమందారెడ్డి రూ.25వేలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద సీరియస్ ఎన్‌వి రామయ్య స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గర్నేపూడి స్టీవెన్, క్రికెట్ క్రీడాకారులు, అశేష ప్రజానీకం పాల్గొన్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-దర్శి



దర్శి గౌతమి గ్రామర్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

స్థానిక గౌతమి గ్రామర్ పాఠశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా పాపసాని రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

తాళ్లూరు : మండలంలోని బొద్దికూరపాడు సరస్వతి మినీ గ్రంథాలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా జనవరి 10నుంచి 12వరకు మూడు రోజులపాటు ముగ్గుల పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, రన్నింగ్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో 15ఏళ్ల లోపు బాలబాలికలకు పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి మినీ గ్రంథాలయం నిర్వాహకురాలు వై పద్మావతి, రిటైర్డ్ సోషల్ మాస్టర్ సన్నపురెడ్డి అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, రమణారెడ్డి, సూరారెడ్డి, యోగిరెడ్డి, డాక్టర్ వేణుమాధవరెడ్డి, వీరనాగిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంధ్యారాణి, దుర్గ, త్రివేణి పాల్గొన్నారు.



బసవాపురంలో రోడ్ల పనులు పర్యవేక్షిస్తున్న రోశయ్య

అంతర్గత రోడ్ల అభివృద్ధి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని మునగపాడు పంచాయతీ పరిధిలోని బసవాపురంలో రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు టిడిపి బీసీసెల్ నాయకులు అంకాల రోశయ్య ఆదివారం ప్రజాశక్తితో తెలిపారు. బసాపురం కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బసవపురం బిసి కాలనీ మండల కేంద్రానికి శివారులో ఉందని అన్నారు. దీంతో తాము రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గతంలో పలుమార్లు వివరించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి తమకు గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.40లక్షల నిధులను మంజూరు చేశారని తెలిపారు. దీంతో ప్రధాన రహదారితో పాటు ఎస్సీకాలనీ వెళ్లే రహదారిని కూడా సిసి రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 90 శాతం పనులు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. మిగిలిన పనులు సబ్ ప్లాన్ నిధులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని కందుల నారాయణరెడ్డి అన్నారని రోశయ్య తెలిపారు.



గ్రామంలో పారిశుధ్యం పర్యవేక్షిస్తున్న సర్పంచి శ్యామ్‌సన్

ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-తాళ్లూరు

మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా గ్రామంలోని మురికి కాలువల వెంట, వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లి, వీధులలోని విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు. రాత్రిపూట వీధులలో వెలుతురు ఉండేటట్లు సర్పంచ్ మంద శ్యామ్‌సన్, ఉపసర్పంచ్ పులి ప్రసాదరెడ్డి కృషి చేస్తున్నారు.



కబడ్డీ పోటీలు ప్రారంభించిన లలితసాగర్

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

పట్టణంలోని సందువారిపాలెంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను తెలుగుదేశం యువనాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ ఆదివారం ప్రారంభించారు. చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, సందువారిపాలెం మాజీ ఎంపిటిసి వైస్ చైర్మన్ కర్నా శ్రీను, యాదగిరి వాసు, ఎన్‌వి రామయ్య పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఇఒ గిరిరాజు నరసింహబాబు కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఇఒ నరసింహబాబు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. నారాయణస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-వేటపాలెం : బిబిహెచ్ జూనియర్ కళాశాలలో ఆదివారం 1998 –99 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు.

పొన్నలూరు: స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1991 నుంచి 1995 విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆటపాటలతో సందడి చేశారు. ప్రస్తుతం వారంతా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-ఇంకొల్లు: పావులూరు గ్రామంలో జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇంకొల్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వీరి నుంచి రూ.4,600 నగదు సాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తూ బ్యారన్ దగ్ధం

ప్రజాశక్తి-కొండపి: మండలంలోని పెదకండ్లగుంటలో ఆదివారం పొగాకు బ్యారన్ దగ్ధం అయింది. అగ్నిమాపక అధికారి సిహెచ్ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకండ్లగుంట గ్రామానికి చెందిన దూదిపల్లి కోటయ్యకు చెందిన బ్యారన్ పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో అల్లుడుకర్ర జారి మొద్దుగొట్టంపై పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ.2.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కారంచేడు : సంక్రాంతి సందర్భంగా కారంచేడు రామానాయుడు ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో ప్రారంభమైన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏలూరి చెప్పారు. అనంతరం క్రీడాకారులతో కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడి తనదైన శైలిలో ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్, కారంచేడు, పర్చూరు, వంకాయలపాడు బ్యాడ్మింటన్ యూత్ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - పంగులూరు



శ్రీనివాసరావు

పంగులూరు మండలంలో వైసీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన రావూరి శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పంగులూరు మండలంలో ఇప్పటికీ పార్టీకి మంచి ఆదరణ ఉందన్నారు. తనపై బాధ్యతను ఉంచి, పార్టీ మండల అధ్యక్ష పదవి ఇచ్చినందుకు జగన్ మోహన్ రెడ్డికి, నియోజవర్గ ఇన్‌ఛార్జి హనిమిరెడ్డికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

'ఎల్లాప్రగడ' సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

వైద్యరంగంలో అనేక సమస్యలకు దివ్య ఔషధంగా పనిచేసిన టెరామైసిన్ మందు కనిపెట్టిన వైద్య పితామహుడు ఎల్లాప్రగడ సుబ్బారావు వైద్య రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ క్లీనిక్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి సందర్భంగా పట్టణంలో జమేదారు పేటలో సాహితీ భారతి కార్యాలయంలో ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఎల్లాప్రగడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మానవజాతి జీవన ప్రదాత ఎల్లప్రగడ సుబ్బారావు తెలుగువారు కావడం తెలుగుజాతికి ఎంతో గర్వకారణం అన్నారు. టెరామైసిన్ మాతృక అయిన టెట్రాసైక్లిన్ ఔషధాన్ని కనుగొన్న యల్లాప్రగడ ప్లేగు, కలరా, క్యాన్సర్, క్షయ, వంటి వ్యాధులకు మందులు కనుగొని టెరామైసిన్ మాంత్రికునిగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచారన్నారు. సాహితీ భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్ జిలాని, సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రి రావు, ఆదం షఫీ, డి.సామ్యూల్, ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీ రామ చంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బస్సు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - పంగులూరు

అద్దంకి నుంచి చందలూరు గ్రామం మీదుగా ఇంకొల్లుకు ఒక్క బస్సు మాత్రమే నడుస్తుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చందలూరు గ్రామ ప్రజలు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించారు. ఆదివారం చందలూరు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు కలిశారు. మండలంలోని అలవలపాడు, తూర్పు తొక్కెల్లపాడు, తూర్పు కొప్పెరపాడు, చందలూరు, నూజిళ్ళపల్లి, కొనికి గ్రామాల ప్రజలు అద్దంకి, ఇంకొల్లుతో పాటు ఇతర ప్రాంతాలకు పలు అవసరాల కోసం నిత్యం ప్రయాణ సాగిస్తుంటారని గ్రామస్తులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని పేరాల కరణం వీధిలోని వినాయకుడి గుడి వద్ద రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర రజక క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు పేరాల జనార్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రజకుల హక్కులు హరించబడుతున్న నేపథ్యంలో రజకులంతా ఐక్యంగా సమస్యల పరిష్కారానికి పోరాడా లన్నారు. జిల్లా కార్యదర్శి పి.కొండయ్య మాట్లాడుతూ రజకులకు ఎస్సీ అట్రాసిటీ లాగా సామాజిక రక్షణ చట్టం తేవాలన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కంది రవిశంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఒంగోలులోని గద్దలగుంటలో కొల్లా హనుమంతురావు అధ్యక్షతన జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్, జిల్లా జనసేన నాయకులు, రవిశంకర్ గ్రూప్ అధినేత కంది రవిశంకర్‌లను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో చనపతి రాంబాబు, అరిగ ప్రతాప్, తోటపల్లి రంగారావు, తోట రామస్వామి మాస్టర్, దండే వెంకటేశ్వరావు, వాసు కాసాని, తిరుమలశెట్టి వెంకట్రావు, ఆరిగ నరసింహారావు, కాటా నాగేశ్వరరావు, జల్లిపల్లి పాపారావు, రిటైర్డ్ సూపర్ సీనియర్ సిటిజన్స్, నారాయణ స్కూల్, ఓరియంటల్ హైస్కూల్, వేదశ్రీ ఎలిమెంటరీ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఉప్పుగుండూరులో వాసవిక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సాహంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. వారు వేసిన ముగ్గులు పలువురిని ఆకట్టున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఐ బి.శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళల్లో సజనాత్మకతను వెలుగు తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మచ్చా మాధవి, రెండో బహుమతి ఏ.కోటేశ్వరమ్మ, మూడో బహుమతి జి.విజయ, నాలుగో బహుమతి మోట సుమతి, ఐదో బహుమతి మాలంపాటి స్రవనప్రియ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కొంజేటి సురేష్ బాబు, మాదాస రాంబాబు, ఎంపిటిసి మున్నంగి వెంకట్రావు, అమరావేణు, రాజేష్, రాఘవేంద్రరావు, శైలజ, కోట వెంకటేశ్వర్లు, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఒంగోలు లక్కీ షాపింగ్ మాల్ సౌజన్యంతో స్థానిక వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్బుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, గ్రంధి లక్ష్మీప్రసాదరావు బహుమతులను పంపిణీ చేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ఒంగోలు లక్కీ షాపింగ్ మాల్ వారు చీరలను బెడ్ షీట్లను స్వచ్ఛందంగా అందించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 13, 14, 15వ తేదీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం నిర్వహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30,116లను సంతమాగులూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొలిశెట్టి మస్తాన్ రావు అందజేస్తారని, అలాగే రెండవ బహుమతి రూ.20,116లను బండారు వెంకటేష్ బ్రదర్స్ అందజేస్తారని, అలాగే మూడో బహుమతి రూ.10,116లను షేక్ కొటికలపూడి బాల సైదా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



స్కాలర్‌షిప్ అందజేస్తున్న జేడీ లక్ష్మీ నారాయణ

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రగతి కల్పించేందుకు అమెరికన్ ప్రోగ్రెస్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో ప్రతిభ స్కాలర్ షిప్పులు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం కాపు కళ్యాణ మండపంలో సుమారు 430 మంది విద్యార్థులకు రూ.80 లక్షల మేర చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో తులసి రామచంద్ర ప్రభు, జేడీ లక్ష్మీనారాయణ, జేవీ వీ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, ఉదయ్ భాస్కర్, వల్లభనేని శ్రీనివాస్, ఆప్త టీం సభ్యులు పౌండర్ శ్రీనివాస్, ముద్రగడ త్రినాథ్, శ్రీనాథ్, నాప కొనసాని, రాజేష్, ఆదిగోపాలం, శ్రీ రమణ, శ్రీకాంత్, కాపు సంఘ అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, శేషాద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

పలువురికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన షేక్ కాలేషాకు రూ.55,250, కౌతరపు శ్రీనివాసరావుకు రూ.25,000, వేమూరు మండలంలోని కుచెల్లపాడు గ్రామానికి చెందిన పెరికల పోతురాజుకు రూ.10,000 చెక్కులను బాధితులకు అందజేశారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

15 నుంచి నాటికల పోటీలు

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామంలో నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండు రంగారావు తెలిపాడు. ఆదివారం ఆయన గ్రామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ పోటీలు 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుతాయన్నారు. ఈ సమావేశంలో నిర్వాహణ కమిటీ సభ్యులు పాండు రంగారావు, వంశీకృష్ణ, తారక రామారావు, పెడవల్లి శ్రీనివాసరావు, మద్దినేని జయరామకృష్ణ, పి.వెంకటేశ్వర్లు, పోపూరి శివ సుబ్బారావు,

సాంప్రదాయ క్రీడలే ముద్దు

ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జూద క్రీడలు వద్దు సాంప్రదాయ క్రీడలే ముద్దు అని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. ఆదివారం బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వారు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన వెటరన్ క్రికెట్ టోర్నమెంట్ లో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. కొంచెం సేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సెక్రటరీ, ప్రెసిడెంట్, క్రీడాకారులను పలకరించి వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పండగ సందర్భంగా ఎవరైనా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా సంబంధిత పోలీస్ అధికారులకు లేదా 112 నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో అండర్ 14 క్రికెట్ జట్టులో ఎన్నికైన అబ్దుల్ సాద్ ఉనాయిస్‌కు క్రికెట్ బ్యాటును బహుకరించి అభినందించారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో సత్తా చాటి జాతీయస్థాయిలో బాపట్ల జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ డి.రామ్మోహన్, ప్రెసిడెంట్ కె. రఘునాథ్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెట్ బ్యాట్ బహూకరిస్తున్న ఎస్పీ

కోడిపందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, కొల్లూరు

కోడిపందేలపై పోలీసులు ఆదివారం సీరియస్‌గా దృష్టి పెట్టారు. ప్రజాశక్తి శనివారం ప్రచురించిన 'పోలీసు హెచ్చరిక..లెక్కచేయక..' కథనానికి ఎస్పీ తుషార్‌డూడి స్పందించారు. కోడిపందేల బరులు ఎక్కడున్నా తొలగించాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. దీంతో వేమూరు, కొల్లూరులో బరులను పోలీసులు ధ్వంసం చేశారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

వేమూరు సిఐ ఆంజనేయులు ఆధ్వ ర్యంలో వేమూరు ఎస్ఐ రవికృష్ణ, స్టేషన్ సిబ్బంది జంపని గ్రామ సమీపాన షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటుచేసిన బరిని ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. బరి చుట్టూ ఏర్పాటు చేసిన జండాలు, టెంట్లు తొలగించారు.

- కొల్లూరు ఎస్సై జి.ఏడుకొండలు తన సిబ్బందితో కలిసి అనంతవరం, కొల్లూరు గ్రామ సమీపాన ఏర్పాటు చేసిన కోడిపందెం బరులను ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. బరి చుట్టూ ఏర్పాటు చేసిన జెండాలు, టెంట్లు, ఫ్లెక్సీలను తొలగించారు.



వేమూరులో బరుల వద్ద ఏర్పాటుచేసిన టెంట్లు పీకేస్తున్న పోలీసులు

కోడిపందేలు నిర్వహిస్తే బైండోవర్ కేసులు

ఎస్పీ తుషార్‌డూడి

సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, గుండాట, జూదం నిర్వహించడం నిషేధమని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. ఎటువంటి జూద క్రీడలు నిర్వహించవద్దని, గతంలో కోడిపందాలు నిర్వహించిన, ఆడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గతంలో కోడిపందాలు నిర్వహించిన ప్రాంతాలలో, అనుమానిత ప్రదేశాలలో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి కోడి పందాలు, గుండాట, జూదము, కోడి పందాలలో పాల్గొన్నా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

యూత్ డే వేడుకల్లో క్విస్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా యూత్ డే జరుపుకుంటారు. దాంట్లో భాగంగా స్టెప్ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏపీ సోషల్ వెల్ఫేర్ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్విస్ గ్రూప్ కి చెందిన ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీసీ వాలంటీర్లు ఆ కార్యక్రమంలో ప్రత్యేక సేవలు అందించారు. వాలంటీర్లను కలెక్టర్, మంత్రి అభినందించారు. ఈ నేపథ్యంలో గతంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో క్విస్ గ్రూప్ విద్యార్థులు బహుమతులు సాధించారు. కథారచన, కవిత్వం, సైన్స్ అండ్ టెక్నాలజీ, హ్యాండీ క్రాఫ్ట్ విభాగాల్లో అవినాశ్, శ్రీనిధి, మేఘన, సూర్య ప్రకాశ్, హర్షిత, లలితాంబిక బహుమతులు అందుకున్నారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదిగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో క్విస్ గ్రూప్ ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీసీ కో - ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను క్విస్ గ్రూప్ అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

ఐఐటి, నీట్ విద్యాబోధనపై అవగాహన

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చెరుకుపల్లిలో ఆదివారం ఐఐటీ, నీట్ విద్యాబోధనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కోటా రాజస్థాన్ వ్యాస్ ఇన్స్టిట్యూట్ ఫౌండర్, సీఈఓ శిశిర్ మిట్టల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఐఐటీ, నీట్ విద్యార్థులను తీర్చిదిద్దడంలో కోటా ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పారు. కోటా చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఉత్కర్ష్ గుప్తా మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులను చూస్తుంటే ఐఐటీ, నీట్ లో టెక్నికల్ గా ఎక్కడా శిక్షణ ఇవ్వడం లేదని చెప్పారు. విద్యార్థి తరగతులు పెరుగుతున్న కొద్దీ ఏ విభాగంలో వెనుకబడుతున్నారు అనేది ప్రతి ఏడాది మెరుగు పరుచుకుంటూ, ప్రతి విద్యార్థి రికార్డును పొందుపరిచి టెక్నికల్ అప్ డేట్ చేసి వారు మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ పి. ఏడుకొండలరెడ్డి, డైరెక్టర్ సాయిరంగారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వందనశర్మ, ప్రిన్సిపాల్ మణివర్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. శివప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రెడయ్ ప్రాపర్టీ షో విజయవంతం

- **రోజుకి 1500 చొప్పున హాజరు**
- **ఘనంగా ముగిసిన ప్రాపర్టీ మెటీరియల్ షో**

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో తొలిసారిగా క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాపర్టీ, మెటీరియల్ షో విజయవంతమైంది. గత మూడు రోజులుగా ఒంగోలు ఏ1 ఫంక్షన్ హాలులో నిర్వహించిన ప్రాపర్టీ, మెటీరియల్ షోకు ప్రతి రోజు 1500 మంది వినియోగదారులు వీక్షించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పానర్స్‌గా వ్యవహరించిన ప్రాపర్టీ షోకు గుప్తాస్ బిల్డింగ్స్, డెవలపర్స్, అర్జున్ ఇన్‌ఫ్రా, రవిశంకర్ గ్రూపు సహకరించాయి. ప్రాపర్టీ, మెటీరియల్ షోలో సుమారు 50కి పైగా స్టాళ్ళను ఏర్పాటు చేశారు. వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్స్, విల్లాస్ కొనుగోలు చేసే వినియోగదారుల, బిల్డర్లు, మెటీరియల్ సరఫరా చేసే కంపెనీలను ఒకే వేదికపైకి ప్రాపర్టీ, మెటీరియల్ షో తీసుకొచ్చింది. ప్రత్యేక ఆకర్షణగా రవిశంకర్ గ్రూపు చదలవాడ చాతుర్వాటిక విల్లాస్ నిలిచింది. అర్జున్ ఇన్‌ఫ్రా, గుప్తాస్ డెవలపర్స్ వాటి స్టాల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు అవసరమైన విల్లాస్‌ను ప్రదర్శనకు ఉంచారు. దేశవ్యాప్తంగా సుమారు 50 జాతీయ, అంతర్జాతీయ గృహ నిర్మాణ రంగానికి చెందిన కంపెనీలు ప్రాపర్టీ, మెటీరియల్ షోలో పాల్గొన్నారు. క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ప్రాపర్టీ, మెటీరియల్ షోలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుతో పాటు ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఛైర్మన్ నాతాని రఘురామయ్య, అధ్యక్షులు జి.రాజేంద్ర మాట్లాడుతూ ఒంగోలు నగరంలో తొలిసారి నిర్వహించిన ప్రాపర్టీ, మెటీరియల్ షో విజయవంతం కావటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రసన్నాంజనేయులు, కోశాధికారి మునగ తిరుమల, ఉపాధ్యక్షులు సిహెచ్ హరి ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ రాఘవ రెడ్డి, సలహాదారులు ఐవి వీరబాబు, శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులు బాబు, కె.రఘునాథ్ పాల్గొన్నారు.

స్వశక్తి సంఘాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- **100 శాతం లక్ష్యాల సాధన**
- **మహిళలు పారిశ్రామికవేత్తగా ఎదిగేలా కృషి**
- **ఆరోగ్య పింఛన్లపై ఇంటింటి పరిశీలన**
- **డిఆర్‌డిఏ పీడీ టి.రవికుమార్**

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్ తెలిపారు. బ్యాంక్ లింకేజీలో 100 శాతం లక్ష్యాల సాధన దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కుటుంబంలో ఒకరిని పారిశ్రామిక వేత్తగా ఎదిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయటంతో పాటు ఆరోగ్య సంబంధ పింఛన్లపై పరిశీలన చేపట్టి అర్హులకు పెన్షన్స్ అందేలా చర్యలు చేపట్టామన్నారు. డిఆర్‌డిఏ ద్వారా స్వశక్తి సంఘాలకు అందిస్తున్న పథకాలను పీడీ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లాలో స్వయం సహాయక సంఘాలు అన్ని రంగాలలో ముందంజ వేసేలా కృషి చేస్తున్నాం. పేదరిక నిర్మూలనలో, సంస్థాగత నిర్మాణంలో భాగంగా నిరుపేద, పేద మహిళలందరిని స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. వారికి తగిన శిక్షణలు ఇచ్చి, ఒక గ్రామంలోని చిన్న సంఘాలన్నింటిని గ్రామ సంఘాలుగా ఒక మండల పరిధిలోని గ్రామ సంఘాలన్నిటిని మండల సమాఖ్యలుగా ఏర్పాటు చేశాం .జిల్లాలో మొత్తం 38 మండల సమాఖ్యలు, 1541 గ్రామ సంఘాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 45432 స్వయం సహాయక సంఘాలు, 4,57,649 మంది సభ్యులు వీటిలో ఉన్నారు.



డిఆర్‌డిఏ పీడీ టి.రవికుమార్

ముఖాముఖి

2.86 లక్షల పెన్షన్లు పంపిణీ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌లో 2024 డిసెంబర్ 1న 2,86,034 మంది లబ్ధిదారులకు రూ.122.23 కోట్లు విడుదల చేసి పంపిణీ చేశాం. 98.53 శాతం పెన్షన్లు పంపిణీ చేయటం జరిగింది. భర్త చనిపోయిన వారు 275 మంది దరఖాస్తు చేసుకుంటే వారికి డిసెంబర్ 31న పెన్షన్లు పంపిణీ చేశాం. జిల్లాలో ఆరోగ్య పింఛన్లు 1236 ఉన్నాయి. డిఆర్‌డిఏ, వైద్యాధికారులు ఇంటింటికి తిరిగి ఆరోగ్య పింఛన్లపై పరిశీలన చేస్తున్నారు. ఇందులో అనర్హులను తొలగించి అర్హులకు ఫిబ్రవరి 1 నుంచి పెన్షన్ అందించనున్నాం.

100 శాతం లక్ష్యాల సాధన

బ్యాంక్ లింకేజీలో 100 శాతం లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నాం. 2024-25 సంవత్సరానికి 13,333 సంఘాలకు రూ.944.85 కోట్లు మంజూరు చేశాం.

జీవనోపాధుల పెంపుదలకు చర్యలు

పేదల జీవనోపాధులు పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నాం. అధిక వడ్డీ భారం నుంచి మహిళా సంఘాల సభ్యులను రక్షించి వడ్డీ లేని రుణాలు అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ నిధి రుణాలు అందిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 24,5000 మంది సభ్యులకు రూ.125 కోట్లు లక్ష్యం కాగా 7561 మంది సభ్యులకు 60.98 కోట్లు మంజూరు చేశాం, ఉన్నతి పథకంలో 2024-25 సంవత్సరానికి మొత్తం 1031 మందికి రూ.5.97 కోట్లు మంజూరు చేశాం. పిఎంఇజిపి యూనిట్లు, పిఎంఎఫ్ఎంఇ యూనిట్లు ఏర్పాటు చేసి స్వశక్తి సంఘాలను అభివృద్ధి చేస్తున్నాం.

రైతు ఉత్పాదక సంఘాలకు రుణాలు

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 38 రైతు ఉత్పాదక సంఘాలు ఏర్పాటు చేశాం. వాటిలో 4724 రైతు ఉత్పాదక గ్రూపులలో 50,319 మంది రైతులు నమోదయ్యారు. 4496 మంది బ్యాంక్ ఖాతాలు తెరిచారు. 777 సంఘాలకు మొత్తం రూ.35.69 కోట్లు రుణాలు మంజూరు చేశాం. రానున్న కాలంలో స్వశక్తి సంఘాల మహిళలను మరింత అభివృద్ధి చేస్తాం.